సాక్షి
నిజామాబాద్
శనివారం । 22 । జూన్ । 2024



ప్రజా సంక్షేమమే లక్ష్యం

ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸



చిన్నబోయిన పెద్ద చెరువు

డొంకేశ్వర్ మండలం దత్తాపూర్ పెద్ద చెరువు కబ్జాకు గురవడంపై ఫిర్యాదులు రావడంతో అధికారులు సర్వే చేపట్టారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.5 /26.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అడపాదడపా జల్లులతో పాటు అక్కడక్కడ భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ముగిసిన పదోన్నతుల ప్రక్రియ

నిజామాబాద్‌అర్బన్ : జిల్లాలో టీచర్ల పదోన్నతుల ప్రక్రియ శుక్రవారం ముగిసింది. తెలుగు పండితులు 260 మంది, హిందీ పండితులు 220 మంది, పీడీలు 90 మంది, ఉర్దూ టీచర్లు 22 మంది, 365 మంది ఎస్జీటీలకు ప్రమోషన్ వచ్చింది. వీరు తమకు కేటాయించిన ప్రాంతాల్లో రిపోర్టు చేశారు. ప్రస్తుతం బదిలీలకు సంబంధించిన ప్రక్రియ కోసం విద్యాశాఖ కసరత్తు చేస్తోంది.

విద్యార్థుల సంఖ్య పెంచడానికి కృషి చేయాలి




ఎడపల్లి(బోధన్): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ఉపాధ్యాయులు కృషిచేయాలని డీఈవో దుర్గాప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం ఎడపల్లి మండలం జానకంపేట్ జెడ్పీ ఉన్నత, ఉర్దూ మీడియం పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. పనులు చేపట్టడంలో జాప్యం జరుగుతుందని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పాఠశాల ఉపాధ్యాయులు డీఈవోకు తెలిపారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడి బోధన పనితీరును పరిశీలించారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం జాన్సన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు మూకుమ్మడి రాజీనామాలు



వర్ని: బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం కాంగ్రెస్‌లో చేరడంతో ఆయన అనుచరులు, మద్దతుదారులైన ప్రజాప్రతినిధులు ఉమ్మడి వర్ని మండలంలో ముకుమ్మడిగా రాజీనామాలు చేశారు. మోస్రా ఎంపీపీ పిట్ల ఉమా శ్రీరాములుతో పాటు ఇద్దరు ఎంపీటీసీలు, ఇద్దరు సొసైటీ చైర్మన్లు, బీఆర్‌ఎస్ అధ్యక్ష కార్యదర్శులతో పాటు వివిధ గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులు పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. వర్ని మండల వైస్ ప్రెసిడెంట్ బాలరాజుతో పాటు ఆరుగురు ఎంపీటీసీలు తాజా మాజీ సర్పంచులు, పార్టీ మండలాధ్యక్షుడు గిరి, కార్యదర్శి గోపాల్, 22 పంచాయతీల బీఆర్‌ఎస్ అధ్యక్ష కార్యదర్శులు, సొసైటీ చైర్మన్ సాయి బాబాతో పాటు వందల మంది కార్యకర్తలు పార్టీకి రిజైన్ చేశారు. చందూరు ఎంపీపీ లావణ్య రాంరెడ్డితో పాటు మరో ఎంపీటీసీ, ఐదుగురు మాజీ సర్పంచులు పార్టీ మండలాధ్యక్షుడితో పాటు ఆయా గ్రామాల అధ్యక్ష కార్యదర్శులు సైతం బీఆర్‌ఎస్‌ను వీడారు.

రైల్వేస్టేషన్‌లో బాలుడి అదృశ్యం



ఖలీల్‌వాడి : నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో ఓ బాలుడు అదృశ్యమైనట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి శుక్రవారం తెలిపారు. వివరాలు.. మదనపల్లి గ్రామానికి చెందిన ధనేవాడ పింకీ, లక్ష్మణ్ దంపతులు గురువారం రాత్రి తమ కుమారుడు మహేందర్(02)తో కలిసి రైల్వే స్టేషన్‌కు వచ్చారు. రాత్రి స్టేషన్‌లో పడుకున్నారు. ఉదయం లేచేసరికి బాబు కనిపించలేదు. రైల్వేస్టేషన్‌లో, బయట వెతికినా దొరకలేదు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. బాలుడి ఆచూకీ తెలిస్తే 8712658591 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

కామారెడ్డి అర్బన్: పెన్షన్‌దారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్, జనరల్ సెక్రెటరీ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సంఘం నాలుగో రాష్ట్ర కార్యవర్గ సమావేశం కామారెడ్డి జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో శుక్రవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. పెన్షన్‌దారుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి ఆందోళనకు సిద్ధంగా ఉండాలన్నారు.

బెస్ట్ అవైలబుల్ ఉత్తిదే..

- జెల్ల కొడుతున్న ప్రైవేటు పాఠశాలలు
- స్కీం కింద చేరిన పేద విద్యార్థుల వద్ద బలవంతంగా వివిధ ఫీజుల వసూలు
- రెండేళ్లుగా ప్రభుత్వం నుంచి అందని రూ. 3.45 కోట్ల బకాయిలు
- బిల్లులు రాకపోతే స్కీం నుంచి తప్పుకుంటామంటున్న స్కూళ్ల యాజమాన్యాలు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పేద ఎస్సీ విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో విద్యనందించే ఉద్దేశంతో నిర్వహిస్తున్న బెస్ట్ అవైలబుల్ స్కీం లక్ష్యం నెరవేరడం లేదు. ఈ స్కీంను నీరుగార్చే విషయంలో ప్రభుత్వం, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు చెరి సగం పాలుపంచుకుంటున్నాయి. ప్రభుత్వం నుంచి నిధులు సకాలంలో రావడంలేదంటూ సంబంధిత పాఠశాలలు జెల్ల కొట్టే పనిలో ఉన్నాయి. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గగ్గోలు పెడుతున్నారు. దీంతో ఈ స్కీం లక్ష్యం నీరుగారిపోతోంది. నిజామాబాద్ జిల్లాలో గత రెండేళ్ల కాలానికి గాను ఏడు పాఠశాలలకు సంబంధించి రూ. 3.45 కోట్ల బకాయిలను చెల్లించాల్సి ఉంది. ఈ బకాయిలు రానందున తాము ఈ పథకం కింద విద్యను అందించలేమని ఆయా పాఠశాలల యాజమాన్యాలు చెబుతున్నారు. నిజామాబాద్‌లో రెండు, బోధన్‌లో రెండు ఆర్మూర్, భీమ్‌గల్, చందూర్‌లలో ఒక్కో ప్రైవేటు పాఠశాల చొప్పున బెస్ట్ అవైలబుల్ పథకం కింద ఉన్నాయి. ఇందుకు సంబంధించి జిల్లాలో ప్రతి ఏటా ఒకటో తరగతిలో 102 మంది విద్యార్థులను, ఐదో తరగతిలో 101 మంది విద్యార్థులను ఆయా ప్రైవేటు పాఠశాలలు చేర్చుకుంటున్నాయి. పథకం కింద ప్రస్తుతం జిల్లాలోని బెస్ అవైలబుల్ కింద 940 మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకుని చదువుతున్నారు. ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులకు డేస్కాలర్, ఐదో తరగతిలో చేరిన విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పించాల్సి ఉంది.

ఉచితంగా అందించాల్సి ఉన్నా..

బెస్ట్ అవైలబుల్ పథకం కింద ఎంపికైన విద్యార్థులకు ఆయా పాఠశాలలు ఉచిత విద్య అందించడంతో పాటు యూనిఫాం, బూట్లు, బ్యాగ్‌లు, పుస్తకాలు ఉచితంగా అందించాల్సి ఉంటుంది. ఇందుకు గాను ప్రభుత్వమే చెల్లింపులన్నీ చేయాల్సి ఉంటుంది. అయితే పరిస్థితి మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉంది. సంబంధిత పాఠశాలలు పుస్తకాలు, యూనిఫాం, బూట్లు తదితరాలకు సంబంధించి విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద నుంచి ముక్కు పిండి మరీ ఫీజులను వసూలు చేస్తున్నాయి. అయితే వసతిగృహాల్లో ఉన్న విద్యార్థులకు కొన్ని పాఠశాలలు ఆహారం సక్రమంగా పెట్టడంలేదని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, అధికారులు ప్రశ్నిస్తే మాత్రం స్కీం నుంచి తాము తప్పుకుంటామని సదరు పాఠశాలల యాజమాన్యాలు చెబుతుండడం గమనార్హం. ఆర్మూర్‌లోని ఒక పాఠశాల అయితే పెండింగ్ బిల్లులు ఇచ్చేవరకు విద్యను బోధించలేమని చెప్పి తప్పుకోవడం గమనార్హం. పరిస్థితి చూస్తుంటే ఈ బెస్ట్ అవైలబుల్ పథకం కొనసాగే అవకాశాలు లేవని విద్యాభిమానులు చెబుతున్నారు.

హస్తం గూటికి పోచారం



పోచారం శ్రీనివాస్‌రెడ్డికి కాంగ్రెస్ కండువా కప్పుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

- కాంగ్రెస్ కండువా కప్పిన సీఎం రేవంత్‌రెడ్డి
- ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్‌కు కోలుకోలేని దెబ్బ
- జిల్లాలో మారనున్న రాజకీయ సమీకరణాలు

సాక్షి, కామారెడ్డి: ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో కీలక నేతగా ఎదిగిన మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెప్పారు. శుక్రవారం కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని పోచారం నివాసానికి వెళ్లి మరీ పార్టీలోకి ఆహ్వానించారు. పోచారంతో పాటు ఆయన తనయులు డీసీసీబీ మాజీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, అలాగే పోచారం సోదరుడు శంభురెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. పోచారం కాంగ్రెస్‌లో చేరడంతో ఉమ్మడి జిల్లాలో రాజకీయ సమీకరణాలు మారనున్నాయి.

కాంగ్రెస్ శ్రేణుల్లో ఆందోళన

పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరతారని కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. అయితే ఆయన చేరికను పలువురు కాంగ్రెస్ నేతలు వ్యతిరేకించారు. పోచారం రాకను అడ్డుకుంటామని బహిరంగంగానే ప్రకటించారు. నస్రుల్లాబాద్‌లో ఆయన దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. తమ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని రాష్ట్ర నాయకత్వాన్ని కోరారు. అయినా పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకోవడంతో పార్టీ శ్రేణులు షాక్‌కు గురవుతున్నాయి. ఏళ్లుగా పార్టీలో పనిచేస్తున్న తమ పరిస్థితి ఏమిటని వారు ఆందోళన చెందుతున్నారు. కాగా పోచారం పార్టీ మారడంతో రాజకీయ సమీకరణాలు మారుతాయని భావిస్తున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో బీఆర్‌ఎస్‌కు పెద్దదిక్కుగా వ్యవహరిస్తూ వచ్చిన పోచారం కారు దిగడంతో ఆ పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లుతుందని భావిస్తున్నారు. అయితే దశాబ్దాలుగా పోచారం వెంట ఉన్న నాయకులు ఆయనతో కలిసి కాంగ్రెస్‌లో చేరుతారా? బీఆర్‌ఎస్‌లోనే ఉండిపోతారా? అన్నదానిపై చర్చ నడుస్తోంది.

బాజిరెడ్డి సవాల్..!

2004 ఎన్నికల్లో పోచారం శ్రీనివాస్‌రెడ్డిని ఓడించిన మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ బాన్సువాడకు తిరిగి రావచ్చని భావిస్తున్నారు. బాజిరెడ్డికి బాన్సువాడ నియోజకవర్గంలో మంచి పట్టుంది. ఆయన నియోజకవర్గంలో చాలామంది అనుచరులున్నారు. పోచారం పార్టీ మార్పు తర్వాత బాజిరెడ్డి మీడియాతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన పోచారం తన పదవికి రాజీనామా చేయాలని, ఉప ఎన్నికలో తనతో పోటీ పడాలని సవాల్ చేశారు. ప్రస్తుతం పోచారం కాంగ్రెస్‌లో చేరడంతో బాన్సువాడ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు నాయకత్వ సమస్య ఎదురవనుంది. ఈ నేపథ్యంలో బాన్సువాడలో పట్టున్న బాజిరెడ్డి గోవర్ధన్ ఇక్కడికి వస్తారన్న ప్రచారం జరుగుతోంది. పోచారం శ్రీనివాస్‌రెడ్డికి సవాల్ విసరడం ద్వారా బాజిరెడ్డి సైతం ఇక్కడికి రావడానికి సిద్ధంగా ఉన్నానన్న సంకేతాలు ఇచ్చారు.

‘బీఆర్‌ఎస్‌లో ఏం తక్కువయ్యిందని పార్టీ వీడారు..’



మోర్తాడ్ : కేసీఆర్ ఏం తక్కువ చేశారని పార్టీ మారారని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఓ ప్రకటనలో ప్రశ్నించారు. “మిమ్మల్ని ఎప్పుడూ లక్ష్మీపుత్రుడని సంబోధిస్తూ అధిక ప్రాధాన్యత ఇచ్చారు. మిమ్మల్ని ఎప్పుడూ పెద్దలు శ్రీనివాస్‌రెడ్డి గారు అంటూ ముందు వరుసలోనే తన పక్కనే కూర్చుండబెట్టుకునే వారు. మిమ్మల్ని మాకు ఆదర్శంగా చూపిస్తూ మీ గురించి గొప్పగా చెప్పేవారు. వ్యవసాయ శాఖ మంత్రిగా, స్పీకర్‌గా సమున్నత స్థానం కల్పించారు. బాన్సువాడ అభివృద్ధికి అడిగినన్ని నిధులిచ్చారు. సీఎం డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి అత్యధికంగా నిధులు తీసుకున్నది మీరే. నేను హౌసింగ్ మినిస్టర్‌గా ఉన్నా నాకంటే ఎక్కువగా బాన్సువాడకు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేశారు. మీరు ఇష్టదైవంగా భావించే తెలంగాణ తిరుమల గుడికి కూడా అడిగినన్ని నిధులు ఇచ్చారు. అలాంటి కేసీఆర్‌ను మోసం చేసి వెళ్లిపోతారా” అంటూ పోచారం శ్రీనివాస్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాణం పోయే వరకు కేసీఆర్ వెంటే ఉంటానన్న విషయాన్ని గుర్తు చేశారు. అధికారం, పదవులు లేకుంటే బతకలేమా అని, ఈ వయసులో పార్టీ మారడం భావ్యమా అని ప్రశ్నించారు. పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచి పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడం దారుణమని, బాన్సువాడ ప్రజలు తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

ఆర్వోబీ పనుల్లో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం

- నిధులు మంజూరవకపోవడంతోనే నత్తనడకన పనులు
- ఎంపీ ధర్మపురి అర్వింద్



మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న ఎంపీ అర్వింద్

నిజామాబాద్‌రూరల్/పెర్కిట్/మాక్లూర్: రాష్ట్ర ప్రభుత్వం నిధులివ్వక మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతున్నాయని ఎంపీ ధర్మపురి అర్వింద్ పేర్కొన్నారు. శుక్రవారం మాధవనగర్, అడవి మామిడిపల్లి, మామిడిపల్లిలలో కొనసాగుతున్న ఆర్వోబీ పనులను ఎంపీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మాధవనగర్ ఆర్వోబీకి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సుమారు రూ. 14 కోట్ల నుంచి రూ. 15 కోట్ల నిధులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. ఆర్‌అండ్‌బీ శాఖమంత్రితో ఫోన్‌లో మాట్లాడానని, అదే విధంగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చొరవతో రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే మంజూరు చేస్తే పనులు త్వరితగతిన పూర్తవుతాయని వివరించారు. అలాగే అర్సపల్లిలో ఆర్‌అండ్‌బీ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని వివరించారు. అడవి మామిడిపల్లి ఆర్వోబీ పనులు పూర్తికావడానికి అధికారులు, కాంట్రాక్టర్‌పై అన్నివిధాలుగా ఒత్తిడి తెస్తున్నానని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో నిధులు దారిమళ్లడం వల్ల పనుల్లో తీవ్రజాప్యం జరిగిందన్నారు. ఇక నుంచి ఆలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. అవసరమైతే బ్రిడ్జిని ఒక పక్క పూర్తి చేసి వన్‌వేలో రాకపోకలకు అనుమతిచ్చి మిగతా సగం పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనులు పూర్తయ్యేందుకు మరో ఆరు నెలలు పడుతుందని చెప్పారు. మామిడిపల్లిలో నిర్మిస్తున్న ఆర్వోబీ రెండు నెలల్లో ప్రజలకు అందుబాటులోకి వస్తుందని ఎంపీ తెలిపారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులచారి దినేశ్, సంబంధిత అధికారులు, బీజేపీ నాయకులున్నారు.

సాదాసీదాగా జెడ్పీ సమావేశం

నిజామాబాద్ రూరల్ : జెడ్పీ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. జెడ్పీ కార్యాలయంలో శుక్రవారం సాధారణ సర్వసభ్య సమావేశం చైర్మన్ విఠల్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చైర్మన్ విఠల్‌రావు మాట్లాడుతూ.. సభ్యులకు ఇదే చివరి సమావేశం కావడంతో ఐదేళ్లలో చేసిన పనులపై అభినందించారు. తమ హయాంలో జిల్లా పరిషత్‌కు పండిత్ దీన్‌దయాల్ జాతీయ అవార్డు దక్కిందని గుర్తు చేశారు. ఐదేళ్లలో జెడ్పీ నూతన కార్యాలయం నిర్మించాలనుకున్నా అనివార్య కారణాలతో నిలిచిపోయిందన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. అధికారులు ప్రొటోకాల్‌ను పాటించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులకు సంక్షేమ పథకాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదనపు కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టామన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల్లో 90 శాతం పనులు పూర్తయ్యాయని వివరించారు. అనంతరం సభ్యులు తమ మండలాల్లోని సమస్యలను వివరించారు. నగరంలోని ఓ స్కానింగ్ సెంటర్‌లో లైంగిక వేధింపులపై జెడ్పీటీసీ సుమన రెడ్డి అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ సరైన సమాధానం చెప్పకపోవడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సులు పెంచాలని సభ్యులు కోరారు. చివరి సమావేశం కావడంతో చైర్మన్ విఠల్‌రావు, వైస్ చైర్‌పర్సన్ రజితయాదవ్‌ను సభ్యులు, అధికారులు సన్మానించారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు



ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

మహిళా శక్తి అమలుకు ప్రణాళిక రూపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్ : మహిళలను ఆర్థికంగా మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మహిళా శక్తి కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో కార్యక్రమ అమలు సన్నద్ధతపై ఆయన చర్చించారు. మహిళా ఉన్నతి – తెలంగాణ ప్రగతి లక్ష్యంతో రానున్న ఐదేళ్లలో మహిళలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం మహిళాశక్తి ద్వారా 14 రకాల కార్యక్రమాలు చేపడుతుందన్నారు. మహిళా శక్తి కింద మైక్రో ఎంటర్‌ప్రెన్యూర్స్, కుట్టు కేంద్రాలు, పాడి పశువులు, బ్యాక్ యార్డ్ పౌల్ట్రీ, పౌల్ట్రీ మథర్ యూనిట్స్, సంచార మత్స్య విక్రయ ఔట్‌లెట్లు, మిల్క్ పార్లర్స్, మీ సేవ, ఈవెంట్ మేనేజ్‌మెంట్, మహిళా క్యాంటీన్లు, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్, ఫుడ్ ప్రాసెస్సింగ్ యూనిట్స్, కస్టం హైరింగ్ కేంద్రాలు వంటి 14 రకాల కార్యకలాపాలు చేపట్టేందుకు మండలాల వారీగా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. కార్యాచరణ ప్రకారం వివిధ మండలాల్లోని మహిళా సమాఖ్యలోని స్వయం సహాయక సంఘాల ద్వారా వివిధ యూనిట్లు నెలకొల్పడమే లక్ష్యంగా ఇప్పటి నుంచే కార్యాచరణకు శ్రీకారం చుట్టాలని సూచించారు. ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే మూడు మాసాలు గడిచినందున, యూనిట్ల గ్రౌండింగ్‌కు సత్వర చర్యలు తీసుకొని బ్యాంకర్లతో సమన్వయం చేసుకుంటూ యూనిట్లు గ్రౌండ్ చేయాలని చెప్పారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరందు, డీఆర్డీవో సాయగౌడ్, జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్, పశు సంవర్ధక శాఖ అధికారి జగన్నాథచారి, మెప్మా పీడీ రాజేందర్ పాల్గొన్నారు.

ధరణి దరఖాస్తులను పరిష్కరించాలి

- తప్పిదాలకు చోటు ఇవ్వకూడదు
- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

బోధన్: ధరణి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, ఎలాంటి తప్పిదాలకు చోటు ఇవ్వొదని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం బోధన్‌లోని నీటిపారుదల శాఖ అతిథి గృహంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ, ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్‌లతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని, ఇందుకు అవసరమైతే అదనపు బృందాలను ఏర్పాటు చేసుకోవాలని తహసీల్దార్లకు సూచించారు. ధరణి పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి రైతుకు ప్రయోజనం చేకూరేలా చొరవ తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అప్పుడే ప్రభుత్వానికి, అధికార యంత్రాంగానికి మంచి పేరు వస్తుందన్నారు. బోధన్ నియోజకవర్గ పరిధిలో 10 వేల దరఖాస్తులకు గాను, 8 వేల దరఖాస్తులు పరిష్కరించారని, మిగిలిన పెండింగ్‌లో ఉన్న 1421 దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలని కలెక్టర్ తహసీల్దార్లను ఆదేశించారు. మ్యుటేషన్, నాలా కన్వర్షన్, ఖాతా మెర్జింగ్, పట్టాదారు పాసు పుస్తకాల్లో డేటా కరెక్షన్, టీఎం–33 అంశాలకు సంబంధించి దరఖాస్తులను క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలన్నారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, మండలాల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



ఘనంగా యోగా డే

ప్రపంచ యోగా దినోత్సవాన్ని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. నగరంలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో, ఇతర ప్రాంతాల్లో వివిధ సంఘాలు, క్లబ్‌లు, సంస్థల ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు.

-వివరాలు లోపలి పేజీల్లో..

క్లుప్తంగా

అద్దె వాహనాల బిల్లులు ఇప్పించాలి



కామారెడ్డి క్రైం : తెలంగాణ ఫోర్‌ వీలర్‌ డ్రైవర్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు కలెక్టరేట్‌లో కామారెడ్డి నూతన కలెక్టర్‌ ఆశిష్‌ సంగ్వాన్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పలు శాఖలలో సక్రమంగా ఇవ్వని అద్దె వాహనాల బిల్లులను ఇప్పించాలని కలెక్టర్‌కు విన్నవించారు. అందుకు కలెక్టర్‌ సంగ్వాన్‌ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు రాజాగౌడ్‌, కోశాధికారి మోయిన్‌ ఖాన్‌, ఆర్గనైజర్‌ రాజేష్‌, బాలరాజు, చంద్రశేఖర్‌, కుమార్‌, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని సజ్జన్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు నూతనంగా వచ్చిన హెచ్‌ఎం సాయన్న, ఉపాధ్యాయులను విద్యార్థులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాఠశాల అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్‌ భవాని, దామోదర్‌, సత్యనారాయణ, రవి, పద్మ, ప్రతిమ, కవిత ఉన్నారు.

నాణ్యతతో వంతెన నిర్మాణం చేపట్టాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని లింగంపల్లికలాన్‌ గ్రామం వద్ద పోచారం ప్రధాన కాలువపై చేపట్టిన వంతెన నిర్మాణ పనుల్లో నాణ్యతను పాటించాలని నాగిరెడ్డిపేట ఎంపీపీ వినీతరెడ్డి, జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి సూచించారు. మండలంలోని లింగంపల్లికలాన్‌ వద్ద జరుగుతున్న వంతెన నిర్మాణ పనులను శుక్రవారం వారు పరిశీలించారు. వర్షాలు కురిస్తే పనులకు ఆటంకం కలుగుందని, ఈ నేపథ్యంలో పనులను వేగవంతం చేయాలని వారు సూచించారు. వారివెంట ఇరిగేషన్‌ ఇన్‌స్పెక్టర్‌ యాదగిరి ఉన్నారు.

ఐఐటీలో గిరిజన విద్యార్థి ప్రతిభ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఎక్కపల్లితండాకు చెందిన గిరిజన విద్యార్థి సభావత్‌ అరుణ్‌సింగ్‌ ప్రతిభ చాటినట్లు తండా వాసులు తెలిపారు. గురువారం సాయంత్రం వెలువడిన జేఈఈ అడ్వాన్స్‌డ్‌ ఆల్‌ ఇండియాలో 135వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. సదరు విద్యార్థికి ఐఐటీ ఖరగ్‌పూర్‌ సీటు వచ్చినట్లు పేర్కొన్నారు. ఎక్కపల్లితండాకు చెందిన గోవింద్‌ అనితల కుమారుడు అరుణ్‌సింగ్‌. తల్లిదండ్రులు, తండా వాసులు, బంధువులు, విద్యార్థిని అభినందించారు.

చిన్నబోయిన పెద్ద చెరువు

- కబ్జా కోరల్లో 106 ఎకరాల శిఖం భూమి
- దత్తాపూర్‌ గ్రామస్తుల ఫిర్యాదుతో మొదలైన సర్వే
- చెరువు హద్దులను గుర్తిస్తున్న అధికారులు



దత్తాపూర్‌ పెద్ద చెరువు

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): మండలంలోని దత్తాపూర్‌ పెద్ద చెరువు కబ్జా కోరల్లో చిక్కుకుంది. డొంకేశ్వర్‌ మండలంలోనే అతిపెద్దదిగా పిలిచే ఈ చెరువు ఆక్రమణకు గురై చిన్నబోయి కనిపిస్తోంది. కళ్ల ముందే చెరువు కబ్జాలకు గురికావడంతో గ్రామస్తులే రంగంలోకి దిగారు. చెరువును కాపాడాలని రెండు రోజుల క్రితం స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో గురువారం రెవెన్యూ, ఇరిగేషన్‌ శాఖల అధికారులు జాయింట్‌ సర్వే నిర్వహించారు. దత్తాపూర్‌ శివారులో సర్వే నంబర్‌–485లో 106 ఎకరాల శిఖం భూమి ఉంది. ఇది కొద్ది కొద్దిగా ఆక్రమణకు గురవుతూ వస్తోంది. హద్దులు దాటి చెరువు భూముల్లో పంటల సాగు, నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇటీవల దర్జాగా మొరం తవ్వకాలు కూడా జరిగాయి. ఇదంతా రెవెన్యూ అధికారుల కళ్ల ముందే జరుగుతున్నా మొన్నటి వరకు చూసీచూడనట్లుగా వదిలేశారు. గ్రామస్తులు ఫిర్యాదు చేసి ఒత్తిడి పెడితే తప్ప అధికారులు సర్వేకు కాలు కదుపలేదు. మొత్తం 106 ఎకరాల విస్తీర్ణం గల చెరువు శిఖం హద్దులను గుర్తించడానికి రెవెన్యూ సర్వేయర్‌ కిషన్‌, ఇరిగేషన్‌ ఏఈ ప్రవీణ్‌ విడివిడిగా సర్వే చేశారు. గ్రామస్తుల సహకారంతో ఉదయం 10 గంటలకు మొదలైన సర్వే సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. చెరువు విస్తీర్ణం పెద్దది కావడంతో సగం మాత్రమే సర్వే పూర్తయింది. శుక్రవారం కూడా సర్వే చేయనున్నారు. ఇరిగేషన్‌ అధికారులు ఆటో లెవల్‌ మిషిన్‌ ద్వారా చెరువు ఎఫ్‌టీఎల్‌ను గుర్తించి హద్దులు పెట్టారు. ఈ హద్దులు పంటపొలాల వరకు వచ్చాయి.

106 ఎకరాల్లో దాదాపు 30 ఎకరాల వరకు ఆక్రమణకు గురైనట్లు తెలుస్తోంది. కాగా ఇక్కడే నిర్మాణం జరుగుతున్న ఓ రైస్‌మిల్లుకు రెవెన్యూ అధికారులే దగ్గరుండి నాలా కన్వర్షన్‌ చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీనికి గ్రామ పంచాయతీ అనుమతి కూడా లేదని తెలుస్తోంది. అయితే, సర్వే పూర్తయిన తర్వాత అధికారులు శిఖం కబ్జాలను తొలగిస్తారా..? లేదా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గుతారా? అనేది వేచి చూడాలి.

హద్దులు ఏర్పాటు చేయాల్సిందే



రెవెన్యూ, ఇరిగేషన్‌ అధికారులు కచ్చితమైన సర్వేను నిర్వహించాలి. చెరువు శిఖంలో ఆక్రమణలు తొలగించి హద్దులు ఏర్పాటు చేయాలి. నిబంధనలకు విరుద్ధంగా మొరం తవ్వకాలు, నిర్మాణాలు జరుగకుండా చూడాలి. బయటి వ్యక్తుల ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గితే గ్రామస్తులంతా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తాం.

– సుంకరి రాజేశ్వర్‌, గ్రామస్తుడు

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం

- డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్‌



యోగాసనాలు చేస్తున్న డీఎంహెచ్‌వో



బస్వాగార్డెన్‌లో యోగా చేస్తున్న విద్యార్థులు

నిజామాబాద్‌నాగారం: యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్‌ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నెహ్రూ యువ కేంద్రం, ఆయుష్‌ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని బస్వాగార్డెన్‌లో యోగాసనాలు చేశారు. జిల్లాలో యోగా గురువులు, ఔత్సాహికులు ఎంతోమంది ఉన్నారని అన్నారు. ప్రముఖ యోగా గురువు రాంచందర్‌ ఆధ్వర్యంలో సాధకులు యోగా చేశారు. జిల్లా యువజన అధికారిణి శైలి బెల్లాల్‌, ఆయుష్‌ అధికారి రమణ మోహన్‌, డాక్టర్‌ తిరుపతి, ఆకాశవాణి అధికారి మోహన్‌ దాస్‌, సిబ్బంది, యోగా గురువులు తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతిలో యోగా ఒక భాగం

- రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ యాదగిరి



యోగాసనాలు వేస్తున్న రిజిస్ట్రార్‌, అధ్యాపకులు

తెయూ(డిచ్‌పల్లి): భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలలో యోగా ఒక భాగమని, యోగాను ప్రపంచానికి పరిచయం చేసి, విస్తృత వ్యాప్తికి భారతదేశం చేసిన కృషి ఎంతో ఉందని తెయూ రిజిస్ట్రార్‌ యాదగిరి పేర్కొన్నారు. తెలంగాణ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్‌ సెల్‌ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. రిజిస్ట్రార్‌ యాదగిరి, ఎన్‌ఎస్‌ఎస్‌ కో–ఆర్డినేటర్‌ కె రవీందర్‌ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్‌ సంపత్‌, ఉద్యోగులు, విద్యార్థులు, సిబ్బందితో కలిసి యోగాసనాలు వేశారు. యోగాతో పలు కఠిన వ్యాధులను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు నందిని, కిరణ్‌ రాథోడ్‌, జూనియర్‌ అసిస్టెంట్‌ సురేశ్‌, విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- బెటాలియన్‌ కమాండెంట్‌ రాంప్రకాశ్‌



యోగాసనాలు వేస్తున్న కమాండెంట్‌ రాంప్రకాశ్‌

డిచ్‌పల్లి: యోగాను నిత్యం ఆచరిస్తే శారీరక, మానసిక ప్రశాంతత చేకూరి సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని ఏడో బెటాలియన్‌ కమాండెంట్‌ బి రాంప్రకాశ్‌ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్ట్‌ ఆఫ్‌ లివింగ్‌ యోగా ట్రైనర్స్‌ బృందం బెటాలియన్‌ను శుక్రవారం సందర్శించి బెటాలియన్‌ అధికారులు, సిబ్బందికి యోగాసనాల్లో శిక్షణ ఇచ్చారు. కమాండెంట్‌ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో తీవ్రమైన ఒత్తిడికి గురయ్యే పోలీసు సిబ్బందికి యోగా మానసిక ప్రశాంతతను ఆరోగ్యాన్ని ఇస్తుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్‌ కమాండెంట్‌ కేపీ శరత్‌కుమార్‌, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

27న జిల్లాస్థాయి స్పోర్ట్స్‌ స్కూల్‌కు ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: జిల్లా స్థాయి స్పోర్ట్స్‌ స్కూల్‌ ఎంపికలను ఈ నెల 27న నగరంలోని రాజారాం స్టేడియంలో నిర్వహించనున్నట్లు డీవైఎస్‌వో ముత్తెన్న శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 4వ తరగతిలో అడ్మిషన్‌ పొందేందుకు ఎంపికలు ఉంటాయన్నారు. అభ్యర్థులు 01.09.2015 నుంచి 31.08.2016 మధ్యలో జన్మించిన వారై ఉండాలన్నారు. ఎంపికలకు హాజరయ్యే వారు ప్రస్తుతం చదువుతున్న స్కూల్‌ నుంచి స్టడీ సర్టిఫికెట్‌, పుట్టిన తేదీ సర్టిఫికెట్‌, అభ్యర్థి ఫొటోలు, 3వ తరగతి ప్రోగ్రెస్‌ కార్డు, ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలన్నారు.

ఏడీఈ విచారణ

నిజామాబాద్‌నాగారం: విద్యుత్‌శాఖలోని నాగారం సెక్షన్‌ ఏఈ సంతకం ఫోర్జరీపై క్వాలిటీ కంట్రోల్‌ ఏడీఈ విచారణ చేపట్టారు. శనివారం నివేదిక అందుతుందని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ రవీందర్‌ తెలిపారు. విచారణలో ఏఈ సంతకం ఫోర్జరీ చేసినందుకు నాగారం సెక్షన్‌కు చెందిన జూనియర్‌ లైన్‌మన్‌ను బాధ్యతల నుంచి సస్పెండ్‌ చేస్తారా లేదా సర్వీసు నుంచి తొలగిస్తారో వేచి చూడాలి. దీనిపై సదరు జేఎల్‌ఎం కూడా విచారణలో తనపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

రాయితో కొట్టి హత్య

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని బోధన్‌ బస్టాండ్‌ ప్రాంతంలో శుక్రవారం ఉదయం ఇద్దరి మధ్య జరిగిన గొడవలో ఒకరు హత్యకు గురైనట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ముస్తయిపురకు చెందిన సయ్యద్‌ అమీర్‌ షేక్‌, జన్నెపల్లి ఎక్స్‌రోడ్‌కు చెందిన మహబూబ్‌(30)కు పాత పరిచయం ఉంది. మృతుడికి అమీర్‌ షేక్‌కు నగదు విషయం గొడవ జరిగినట్లు సమాచారం. కాగా నిందితుడు వైటనర్‌ మత్తు తీసుకోవడంతో కోపంలో మహబూబ్‌పై రాయితో దాడి చేసి హత్య చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

లాటరీ పేరిట సైబర్‌ మోసం

ఎల్లారెడ్డి: లాటరీ పేరిట సైబర్‌ మోసానికి గురైన ఘటన మండలంలోని మల్కాపూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మల్కాపూర్‌కు చెందిన లింగంపేట బాలకృష్ణకు గుర్తు తెలియని ఫోన్‌ నుంచి రూ. 5 లక్షల లాటరీ తగిలిందని దానిని పొందేందుకు కొంత డబ్బులను చెల్లించాలని సూచించడంతో బాలకృష్ణ పలు దఫాలకుగా రూ.38,805 చెల్లించగా ఇంకా చెల్లించాలని సూచించడంతో మోసపోయినట్లు గుర్తించి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం

కామారెడ్డి క్రైం: రోజు మాదిరిగా ఉదయాన్నే వాకింగ్‌కు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని దేవునిపల్లిలో ఉండే విద్యుత్‌నగర్‌ కాలనీకి చెందిన రేణుక శుక్రవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో వాకింగ్‌కు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల గాలించిన ఆచూకీ లభించలేదు. ఆమె చెల్లెలు నీరడి సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నాటుసారా పట్టివేత



సిరికొండ: మండలంలోని గడ్డమీది తండా, నడ్మి తండా, ముషీర్‌నగర్‌, వర్జన్‌ తండా, ఒంటిప్ప తండాల్లో శుక్రవారం దాడులు నిర్వహించి నాటుసారాను పట్టుకున్నట్లు భీంగల్‌ ఎక్సైజ్‌ సీఐ వేణు మాదవ్‌ తెలిపారు. దాడుల్లో పది లీటర్ల నాటుసారా, 200 లీటర్ల బెల్లం పాకం స్వాధీనం చేసుకొన్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి సారా తయారు చేస్తున్న ముగ్గురిని అరెస్ట్‌ చేసినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో టాస్క్‌ ఫోర్స్‌ సీఐ విలాస్‌, ఎన్‌ఫోర్స్‌మెంట్‌ సీఐ స్వప్న, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్‌ లక్ష్యం

- రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- రూ.28కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మోపాల్‌: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. ఆరు గ్యారంటీల అమలుకు సీఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉన్నారన్నారు. మోపాల్‌ మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ, సెంట్రల్‌ లైటింగ్‌, ముదక్‌పల్లి చౌరస్తా నుంచి కులాస్‌పూర్‌ వరకు రోడ్డు విస్తరణ, బ్రిడ్జి పనులకు శంకుస్థాపన, కులాస్‌పూర్‌లో పెద్దమ్మ ఆలయం వద్ద సీసీ రోడ్డు నిర్మాణం, అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మండలంలో 5 నెలల్లో రూ.28కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

రూ.2లక్షల రుణమాఫీ

ఆగస్టు 15లోపు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేసి తీరుతామని, ఆ మేరకు ప్రక్రియ ప్రారంభమైందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మోపాల్‌, కులాస్‌పూర్‌ అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని, రెండు గ్రామాలంటే తనకు ప్రత్యేకమైన అభిమానమని పేర్కొన్నారు. మోపాల్‌, కులాస్‌పూర్‌, బాడ్సి, ముదక్‌పల్లి, గ్రామ కమిటీలు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించాయి. బాడ్సి జెడ్పీహెచ్‌ఎస్‌ని సందర్శించిన ఎమ్మెల్యేకు మూత్రశాలలు, మరుగుదొడ్ల కొరత ఉందని విద్యార్థులు ఆయన దృష్టికి తెచ్చారు. వెంటనే అధికారులతో మాట్లాడి త్వరగా పూర్తి చేయించాలని ఆదేశించారు. పీసీసీ డెలిగేట్‌ బాడ్సి శేఖర్‌ గౌడ్‌, ముప్ప గంగారెడ్డి, గడ్కోల్‌ భాస్కర్‌రెడ్డి, లతా కన్నీరాం, యాదగిరి, గొర్కంటి లింగం, బోర్గాం శ్రీనివాస్‌, ఎల్లోల్ల సాయిరెడ్డి, మోహన్‌రెడ్డి, గంగారెడ్డి, రఘు, రాములు, రమేశ్‌, హన్మంత్‌రావు, నాగోరావు, లింగం, రామేశ్వర్‌, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

షబ్బీర్‌అలీ సమీక్షలు చేస్తే తప్పేంటి

- కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గడుగు గంగాధర్‌



మాట్లాడుతున్న గడుగు గంగాధర్‌

ఖలీల్‌వాడి: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సలహాదారుడిగా షబ్బీర్‌అలీ ఆ శాఖలపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తే తప్పేముందని అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణను పీసీసీ కార్యదర్శి గడుగు గంగాధర్‌ ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్‌ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. షబ్బీర్‌ అలీకి ప్రభుత్వం కేటాయించిన శాఖలపై ఆయా అధికారులతో సమీక్షలు జరుపుతారని, వీరికి లబ్ధి చేకూర్చేందుకు తగు చర్యలు తీసుకొవడానికి సలహాదారుడి హోదాలో సమీక్ష చేశారని తెలిపారు. అర్బన్‌ ఎమ్మెల్యే కేవలం అర్బన్‌ ప్రాంతానికి మాత్రమేనని షబ్బీర్‌అలీ రాష్ట్ర వ్యాప్తంగా ఈ శాఖలకు సలహాదారుడిగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. కిందిస్థాయి వర్గాలకు మేలు చేయడానికి నీవంతు సలహాలు, సూచనలు చేయాలని ఎమ్మెల్యేకు హితవు పలికారు. ఎమ్మెల్యే విమర్శలు మాని నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. మరోసారి కాంగ్రెస్‌ నాయకులను విమర్శిస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో భక్త వత్సలం, కొడవ శరత్‌ తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి జూనియర్‌ డాక్టర్ల సమ్మె



వైస్‌ ప్రిన్సిపాల్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న జూనియర్‌ డాక్టర్లు

నిజామాబాద్‌నాగారం: తమ డిమాండ్ల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంపై తెలంగాణ జూనియర్‌ డాక్టర్స్‌ అసోసియేషన్‌ పిలుపు మేరకు ఈ నెల 24 నుంచి సమ్మె నిర్వహించనున్నట్లు జూనియర్‌ డాక్టర్లు పేర్కొన్నారు. సమ్మెకు సంబంధించిన నోటీసును ప్రభుత్వ మెడికల్‌ కళాశాల వైస్‌ ప్రిన్సిపాల్‌ నాగమోహన్‌కు శుక్రవారం అందజేశారు. తమ డిమాండ్లు పూర్తిగా నెరవేరే వరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు. అనంతరం జీజీహెచ్‌ సూపరింటెండెంట్‌కు సమ్మె నోటీసు అందజేశారు. తెలంగాణ జూడా ఉపాధ్యక్షుడు సురేశ్‌ నీరుడి, డాక్టర్‌ చంద్రకాంత్‌, డాక్టర్లు పాల్గొన్నారు.

దైవదర్శనానికి వెళ్లొస్తూ.. అనంతలోకాలకు

- ట్రాక్టర్‌ బోల్తాపడి ఒకరి మృతి
- నలుగురి పరిస్థితి విషమం
- 15 మందికి తీవ్రగాయాలు



క్రేన్‌ సాయంతో ట్రాక్టర్‌ను తొలగిస్తున్న సిబ్బంది

పెద్దకొడప్‌గల్‌(జుక్కల్‌): దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా ట్రాక్టర్‌ అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో ఒకరు మృతి చెందగా, నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఘటనకు సంబంధించి పెద్దకొడప్‌గల్‌ ఎస్సై కోనారెడ్డి, జుక్కల్‌ ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం. బిచ్కుంద మండల కేంద్రానికి చెందిన వల్లెపు నాగమ్మ కొలాస్‌లో ఉండే రేణుకాఎల్లమ్మకు దైవదర్శనం కోసం శుక్రవారం ఉదయం కుటుంబీకులతో పాటు, కుల సంఘ సభ్యులతో కలిసి ట్రాక్టర్‌లో వెళ్లారు. అమ్మవారి దర్శనం అనంతరం అందరూ సహపంక్తి భోజనం చేశారు. తిరుగు ప్రయాణంలో సంగారెడ్డి–నాందేడ్‌ 161 జాతీయ రహదారిపై జుక్కల్‌ చౌరస్తా సమీపంలో ట్రాక్టర్‌ అదుపు తప్పి బోల్తా పడింది. కాగా డ్రైవర్‌ మద్యం మత్తులో నిర్లక్ష్యపు డ్రైవింగ్‌ చేయడంతోనే ఈ ఘటన చోటు చేసుకుందని స్థానికులు తెలిపారు. ప్రమాదంలో అంజిలి(13) అక్కడికక్కడే మృతి చెందగా నలుగురి పరిస్థితి విషమంగా ఉందని, మరో 15 మందికి తీవ్రగాయాలయ్యాయి. ఘటన విషయం తెలుసుకున్న పెద్దకొడప్‌గల్‌ ఎస్సై కోనారెడ్డి అక్కడికి చేరుకొని గాయాలైన వారిని హైవే అంబులెన్స్‌లో బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్‌ వల్లెపు రాజుతో పాటు వల్లెపు అంజయ్య, వల్లెపు వెంకవ్వ పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్‌ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తండ్రి గురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జుక్కల్‌ ఎస్సై సత్యనారాయణ పేర్కొన్నారు.

ఫైనాన్స్‌ వేధింపులకు యువకుడి బలి



వంశీ (ఫైల్‌)

దోమకొండ: ఫైనాన్స్‌ సంస్థ వేధింపులకు ఓ యువకుడు బలయ్యాడు. ఇన్‌స్టాల్‌మెంట్‌ కట్టకపోవడంతో సంస్థ సిబ్బంది ఇంటికి వచ్చి బెదిరించడంతో ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి. దోమకొండ మండలంలోని అంచనూరు గ్రామానికి చెందిన చిన్నారం వంశీ(20) రెండేళ్ల క్రితం బైక్‌ కొనుగోలు చేశాడు. దానికోసం ఓ ఫైనాన్స్‌ సంస్థలో రూ. 75 వేలు రుణం తీసుకున్నాడు. రెండేళ్లుగా ప్రతినెలా ఈఎంఐ చెల్లిస్తున్నాడు. ఇంకా రూ. 15 వేల బాకీ ఉన్నాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో ఈఎంఐ చెల్లించలేదు. దీంతో శుక్రవారం సదరు ఫైనాన్స్‌ కంపెనీ సిబ్బంది వంశీ ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో వంశి ఇంట్లో లేకపోవడంతో బైక్‌ ఇన్‌స్టాల్‌మెంట్‌ డబ్బులు చెల్లించాలని కుటుంబ సభ్యులను అడిగారు. డబ్బులు కట్టకపోతే పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని బెదిరించారు. ఈ విషయాన్ని వంశికి అతడి తల్లిదండ్రులు లక్ష్మి, దేవయ్య ఫోన్‌ ద్వారా తెలిపారు. దీంతో మనస్తాపం చెందిన వంశి గ్రామ శివారులోని ఎడ్లకట్ట వాగు వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని దోమకొండ పోలీసులు తెలిపారు.

22 క్వింటాళ్ల పీడీఎస్‌ బియ్యం పట్టివేత



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌ కాలనీలో ఉన్న ఓ ఇంట్లో పీడీఎస్‌ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచారనే సమాచారం రావడంతో టాస్క్‌ ఫోర్స్‌ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో షేక్‌ అర్బాజ్‌ అనే వ్యక్తి తన ఇంట్లో 45 బస్తాల్లో పీడీఎస్‌ బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉంచినట్లు గుర్తించారు. వెంటనే నిల్వ ఉంచిన రేషన్‌ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు.

హైటెక్‌ వ్యభిచారం గుట్టురట్టు

ఖలీల్‌వాడి: నగరంలోని సుభాష్‌నగర్‌ ప్రాంతంలో కొనసాగుతున్న హైటెక్‌ వ్యభిచారాన్ని గుట్టురట్టు చేసినట్లు సీఐ నరహరి, మూడో టౌన్‌ ఎస్సై ప్రవీణ్‌ కుమార్‌ తెలిపారు. సీపీ కల్మేశ్వర్‌ ఆదేశాల మేరకు అడిషనల్‌ డీసీపీ కోటేశ్వరరావు, ఏసీపీ రాజా వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఈ దాడి జరిగింది. వివరాలిలా ఉన్నాయి. సుభాష్‌నగర్‌ ప్రాంతంలోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేయగా ఇద్దరు మహిళలు, ఒక విటుడు, వ్యభిచార నిర్వాహకురాలిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. సుభాష్‌నగర్‌లో నిర్వాహకులు ఓ ఇంటిని అద్దెకు తీసుకొని కొంతమంది మహిళలకు డబ్బుల ఆశ చూపి వ్యభిచారం నిర్వహిస్తోందని పేర్కొన్నారు. దాడిలో ఏఎస్సై లీలాకృష్ణ, లక్ష్మీనారాయణ, కానిస్టేబుల్‌ రఘువర్ధన్‌, చామీంద్‌, గంగకుమార్‌, అబ్బులు, బాబులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న బస్సును ఢీకొన్న ఆటో

నిజామాబాద్‌రూరల్‌: జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్‌ బైపాస్‌ సిగ్నల్‌ వద్ద ఆగి ఉన్న బస్సును వెనుక నుంచి ఆటో ఢీకొన్నది. సిగ్నల్‌ పడంతో ఆగిన బస్సును చూసుకోక పోవడం వల్లే ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఆటోలో ఉన్న నలుగురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ విషయమై రూరల్‌ ఎస్‌హెచ్‌వోను వివరణ కోరగా ఇప్పటి వరకు ఎలాంటి కేసు నమోదు కాలేదని తెలిపారు.

క్రైం కార్నర్‌

అటవీ ప్రాంతంలో మహిళ మృతి



పర్జాన(ఫైల్‌)

భిక్కనూరు: మండలంలోని తిప్పాపూర్‌ అటవీ ప్రాంతంలో మహిళ మృతి చెందినట్లు గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన పర్జాన(33) ఈనెల 19న ఉదయం ఇంటి నుంచి కట్టెలు తెచ్చేందుకు అటవీ ప్రాంతానికి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు, గ్రామస్తులు వెతకడంతో గురువారం రాత్రి ఆమె మృతదేహం అటవీ ప్రాంతంలోని రోళ్లబండ్ల ప్రాంతంలోని చిన్నకుంట వద్ద లభించింది. పర్జానపై గుర్తు తెలియని అటవీ జంతువు దాడి చేయడంతోనే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆమె కుడి చేయిపై జంతువు తీవ్రంగా గాయం చేసినట్లు ఆనవాళ్లు ఉన్నాయని పేర్కొన్నారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పర్జానకు భర్త నజీమొద్దీన్‌, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. ఈ విషయమై గ్రామస్తులు భిక్కనూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

నాగిరెడ్డిపేట: మండలంలోని రాఘవపల్లికి చెందిన నార్ల నాగయ్య(55) శుక్రవారం ఉదయం ఎల్లారెడ్డి ఆస్పత్రిలో మృతిచెందాడు. ఈ నెల 17న రాత్రి నాగయ్య కత్తిగాట్లతో గాయపడిన విషయం తెలిసిందే. నాటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగయ్య శుక్రవారం మృతిచెందాడు. నాగయ్య మరణానికి గుండెపోటు కారణమని ఆస్పత్రి వైద్యులు ప్రాథమికంగా నిర్ధారించారని నాగిరెడ్డిపేట ఎస్సై రాజు తెలిపారు. నాగయ్య కత్తిగాట్లతో గాయపడిన ఘటనకు సంబంధించి నమోదు చేసిన కేసు విచారణ కొనసాగుతుందని,విచారణ తర్వాత కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడిస్తామని పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యం

ఎడపల్లి: మండలంలోని మంగళ్‌పాడ్‌కు చెందిన చిత్తారి సంతోష్‌ అదృశ్యమైనట్లు ఎస్సై వంశీకృష్ణరెడ్డి శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సంతోష్‌ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 17న పని ఉందని ఇంట్లో చెప్పి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లి పోశాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మాక్లూర్‌: మండలంలోని అడవిమామిడిపల్లి ఊర చెరువులో గుర్తు తెలియని మృతదేహం శుక్రవారం లభ్యమైనట్లు ఎస్సై సుధీర్‌రావు పేర్కొన్నారు. సుమారు 35 ఏళ్ల యువకుడు నాలుగు రోజుల కితం చెరువులో పడి మృతి చెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి ఆచూకీ వివరాలు ఎవరికైనా తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

ఆకుల కొండూర్‌లో..

నిజామాబాద్‌రూరల్‌: మండలంలోని ఆకుల కొండూర్‌లో గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యమైనట్లు రూరల్‌ ఎస్‌హెచ్‌వో మహేశ్‌ శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఆకుల కొండూర్‌ గ్రామ ప్రయాణ ప్రాంగణంలో వృద్ధురాలు పడి ఉండడం చూసి అదే గ్రామానికి చెందిన చైర్మన్‌ అశోక్‌ పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు. వృద్ధురాలి ఆచూకీ ఎవరికైనా తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.